# పథకాలను మెచ్చే పార్టీలో చేరికలు



పుట్ట మధు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు, యువకులు

- పెద్దపల్లి జడ్పీ చైర్మన్, మంథని బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్
- గులాబీ పార్టీలోకి కాంగ్రెస్, యూత్ నాయకులు
- కండువా కప్పి సాదర ఆహ్వానం

మంథని అక్టోబర్ 17: సర్కారు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మెచ్చే అన్ని పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. కాటారం కాటారం మండలం శంకరంపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత జక్కుల సదయ్య, మరో 10 మంది యువకులు, దేవరాంపల్లికి చెందిన యువకులు, పాలకుర్తి మండలం కన్నాల ఉప సర్పంచ్ పుట్ట రంజిత్, పాలకుర్తి మండలం రామయ్యపల్లికి చెందిన పెండ్రు సుమంత్ రెడ్డి, మంథని మండలం వెంకటాపూర్, మహాముత్తారం, మల్హర్, కాటారం మండలాలకు చెందిన మున్నా సైన్యం యువకులు సుమారు 150 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంథనిలోని రాజగృహాలో మధూకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలు అధోగతిపాలయ్యారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో అన్ని వర్గాలకు మేలు చేసిందని చెప్పారు. మంథని నియోజకవర్గాన్ని తాను ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా ఎవరు ఊహించని విధంగా అభివృద్ధి చేశానన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు బయ్యపుమనోహర్‌రెడ్డి, ఇనగంటి రామారావు, పీట్లగోపాల్, పుప్పాల దయానంద్, శెంకేసి రవీందర్, కన్నూరి సతీశ్, రంజిత్ ఉన్నారు.



పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## పుట్టమధు గెలువాలని బీఆర్‌ఎస్ నాయకుల పూజలు

పాలకుర్తి, అక్టోబర్17: మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టమధు గెలుపు కోసం పాలకుర్తి మండలం రాణాపూర్ కోదండ రామాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పూజలు చేశారు. కన్నాల ఫ్యాక్స్ చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి ఆదేశాలమేరకు గ్రామంలోని బీఆర్‌ఎస్ నాయకులు ఆలయంలో పూజలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. నాయకులు మునిగాల సదానందం, కాదాసితిరుపతి, బాలగోని కుమార్‌గౌడ్, బూడిదకుమార్, ఇటుకల శ్రీకాంత్, నందిసురేష్, కోల శ్రీనివాస్, అంబటి ఉదయ్, బూడిద బానుచందర్, కుమ్మరి సారయ్య, మడిపెల్లి కమలాకర్, సంటినగేష్, అవునూరిశ్రవణ్, ఆసంశంకర్, సంటితిరుపతి, పోగుల రాజయ్య, సంటిరాజు, వెగళం జగన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

# డిస్మిస్డ్ ఉద్యోగులకు మరో అవకాశం

గోదావరిఖని, అక్టోబర్ 17ః సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తూ గత మూడేండ్లలో 2019, జనవరి 1 నుంచి 31 డిసెంబర్ 2022 వరకు గైర్హాజరు కారణంగా డిస్మిస్ అయిన ఉద్యోగులను తిరిగి ఉద్యోగ నియామకం కోసం సింగరేణి యాజమాన్యం విధుల్లోకి తీసుకునేందుకు అవకాశం కల్పించిందని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్ రావు కే.వెంకటేశ్వర్లు తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు హై పవర్ కమిటీ చే నిర్వహించనున్న రివ్యూ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలో డిస్మిస్ కాలం నాటికి 46 సంవత్సరాలు, అంతకంటే తక్కువ వయసు కలిగి ఉండాలనీ, కనీసం 100 మస్టర్లు కలిగి ఉండి బదిలీ వర్కర్, కేటగిరి–1గా తిరిగి నియామకం కోసం తగిన మెడికల్ అన్‌ఫిట్ కలిగి ఉండాలన్నారు. అర్హులైన డిస్మిస్ కార్మికులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకొని తిరిగి ఉద్యోగం పొందాలని కోరారు.

# రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక

కోల్‌సిటీ, అక్టోబర్ 17: మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు గోదావరిఖని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం జింక మల్లేశ్, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్ తెలిపారు. ఆ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చైతన్య శ్రీ, 9వ తరగతి చదువుతున్న కే.సాయి మేఘనలు ఎంపికైనట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు సోమవారం సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో జరగగా, పెద్దపల్లి జిల్లా నుంచి వీరిద్దరు మంచి ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఇటీవలనే చైతన్య శ్రీ సరూర్‌నగర్‌లోని వాలీబాల్ అకాడమీలో ప్రవేశం పొందడం విశేషం. వీరిని ఉపాధ్యాయులు, క్రీడాకారుల తల్లిదండ్రులు అభినందించారు.

# బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పరిశీలన

రామగిరి, అక్టోబర్ 17ః ఈనెల 22న స్థానికరాణీ రుద్రమదేవి స్టేడియంలో జరగనున్న బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు పరిశీలించారు. మంగళవారం ఆయన సెంటినరీకాలనీలోని స్టేడియంను సందర్శించి ఏర్పాట్లు త్వరితగతిన చేపట్టాలన సూచించారు. కార్మిక కుటుంబాలు అధిక సంఖ్యలో హాజరవుతున్నందున అన్ని వసతులు కల్పించాలనీ, ఉత్తమ బతుకమ్మల విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఓటూ జీఎం రఘుపతి, సేఫ్టీ అధికారి వెంకటరమణ, డీజీఎం పద్మరాజు, పీఎం రవీందర్ రెడ్డి, ఎస్ఓ లక్ష్మీనారాయణ, డా.కల్యాణ్ చక్రవర్తి, గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్ ఉన్నారు.

## రూ. 3.56 లక్షలు స్వాధీనం

ధర్మారం/రామగిరి అక్టోబర్17:పెద్దపల్లి జిల్లా ధర్మారం శివారులోని జక్కన్నపల్లి వద్ద రూ. 2.55లక్షలు, రామగిరి మండలం కల్వచర్ల వద్ద రూ. 1.01 లక్షలను పోలీసులు పట్టుకున్నారు. ధర్మారం ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల నేపథ్యంలో ధర్మారం – రాజారాంపల్లి సరిహద్దులో గల జక్కన్నపల్లి వద్ద పోలీసులు మంగవారం వాహనాల తనిఖీ చేపట్టారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిళిపాలెం గ్రామానికి చెందిన పాకాల కుమారస్వామి నుంచి రూ.85వేలు, రామగుడుకు చెందిన కోయల్‌కార్ ఈశ్వర్ నుంచి రూ.82వేలు, జనగామ జిల్లా పాలకుర్తి మండలం కొండాపురం గ్రామానికి చెందిన బానోతు రవి నుంచి రూ.87,800 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. రామగిరి మండలం కల్వాచర్ల వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు.

# సివిల్ కాంట్రాక్ట్ మాన్యువల్ సవరణలు చేయాలి



మాట్లాడుతున్న సింగరేణి సివిల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు

రామగిరి, అక్టోబర్ 17: సింగరేణి సివిల్ కాంట్రాక్ట్ మాన్యువల్–2023లో సవరణలను చేసి పాత పద్ధతిలోనే కొనసాగించాలని సింగరేణి సంస్థ సివిల్ కాంట్రాక్టర్లు తీర్మానించారు. ఈ మేరకు ఆర్జీ–3 ఏరియా సెంటినరీకాలనీలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాలకు చెందిన సివిల్ కాంట్రాక్టర్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా ఏరియాల అధ్యక్షులు మాట్లాడారు. యాజమాన్యం కొత్తగా చేసిన సవరణలు కాంట్రాక్టర్లకు నష్టదాయకంగా ఉన్నాయనీ, కొన్నేండ్లుగా సింగరేణి సంస్థను నమ్ముకొని కాంట్రాక్టర్లుగా కొనసాగుతూ జీవనోపాధి పొందుతున్నామనీ, సంస్థ అప్పగించిన ఏ పనులైనా సమర్ధవంతంగా పూర్తి చేస్తూ సహకరిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం యాజమాన్యం కొత్తగా తీసుకవచ్చిన మాన్యువల్‌లో సవరణ చేసి పాత పద్ధతినే పునరుద్ధరించే వరకు సివిల్ కాంట్రాక్టర్లు ఎవరూ టెండర్లలో పాల్గొనవద్దని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా చలో కొత్తగూడెంకు ఆయా డివిజన్ల నుంచి 101 మంది ప్రతినిధులతో వెళ్లి కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి యాజమాన్యంకు తమ సమస్యలను విన్నవిస్తామని తెలిపారు. చలో కొత్తగూడెంను కాంట్రాక్టర్లు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షులు కనుకుల మొండయ్య, ముఖ్య సలహాదారు పీటీ స్వామి, ఆర్జీ–3 అధ్యక్షులు రాంచందర్, తొట్ల తిరుపతి యాదవ్, ఆర్జీ–2 అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మల్లయ్య, ఆర్జీ–1 ఉపాధ్యక్షులు సదానందం, నరేందర్, శ్రీరాంపూర్ అధ్యక్షుడు పీ.సంపత్‌కుమార్, రాంరెడ్డి, గోలేటి అధ్యక్షులు గోపి రెడ్డితోపాటు సివిల్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

కమాన్‌పూర్,అక్టోబర్ 17: మండలంలోని అన్ని గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను గోదావరిఖని టూ టౌన్ సీఐ వేణుగోపాల్ కమాన్‌పూర్ ఎస్సై బేతి రాములు రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ ప్రక్రియ నిర్వహణతోపాటు వసతుల కల్పనకు సంబంధించి పరిస్థితులను పర్యవేక్షించారు.

## అవయవదానం

ఓదెల, అక్టోబర్ 17: ఓదెల గ్రామానికి చెందిన ఎంపీటీసీ బోడకుంట లక్ష్మి– చినస్వామిల అల్లుడు హరికృష్ణ (38) అవయవాలను మంగళవారం దానం చేశారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న హరికృష్ణ బ్రెయిన్ డెడ్ చనిపోయాడు. ఓదెలకు చెందిన సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి కుటుంబీకులకు అవయదానం గురించి వివరించారు. దీంతో వారు అవయదానాలకు అంగీకారం తెలిపారు. మొత్తం 6అవయవాలను జీవన్‌దాన్ బృందం సారథ్యంలో సేకరించినట్లు పేర్కొన్నారు. ఆరుగురికి కొత్త జీవితాన్ని ఇచ్చిన హరికృష్ణ కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

# దుర్గామాత మండపాల్లో భక్తుల పూజలు



హోమం చేస్తున్న భక్తులు

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 17: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ మండపాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దర్గామాతకు భక్తులు పూజలు చేస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని రాఘువాపూర్, రంగాపూర్, అప్పన్నపేట, చీకురాయి, హన్మంతునిపేటలో మంగళవారం పూజలు చేశారు. మూడో రోజు అన్నపూర్ణ దేవిగా అమ్మవారిని అలంకరించారు. చీకురాయిలో రామ్‌సేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో దంపతులతో హోమం జరిపించారు.ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు